ఘనంగా సర్దార్ వల్లభాయ్ పటేల్ 151వ జయంతి వేడుకలు

జాతీయ ఐక్యత, సమగ్రతను కాపాడటం ప్రతి పౌరుడి బాధ్యత: కలెక్టర్ సి.నారాయణరెడ్డి



దశ, రంగారెడ్డి: భారతదేశ ఐక్యత, సమగ్రతను కాపాడేందుకు ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా వ్యవహరించాలని రంగారెడ్డి జిల్లా కలెక్టర్ సి.నారాయణరెడ్డి పిలుపునిచ్చారు. జాతీయ ఐక్యతా స్ఫూర్తిని పెంపొందిస్తూ దేశ సమగ్రతను పరిరక్షించేందుకు నిరంతరం కృషి చేయాలని సూచించారు. సర్దార్ వల్లభాయ్ పటేల్ 151వ జయంతి, జాతీయ ఐక్యతా దినోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం సమీకృత జిల్లా కలెక్టరేట్‌లో వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ సి.నారాయణరెడ్డి పటేల్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. స్వాతంత్ర్యం అనంతరం దేశంలోని 500కు పైగా సంస్థానాలను భారతదేశంలో విలీనం చేసి జాతీయ సమైక్యతను బలోపేతం చేయడంలో పటేల్ కీలక పాత్ర పోషించారని కలెక్టర్ కొనియాడారు. ఆయన నాయకత్వం, దూరదృష్టి, దేశభక్తి నేటి తరానికి స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. దేశ స్వాతంత్ర్య ఉద్యమంలో పటేల్ చేసిన సేవలను, స్వాతంత్ర్యం అనంతరం దేశ సమైక్యత కోసం ఆయన చేసిన కృషిని ఈ సందర్భంగా స్మరించుకున్నారు. ఆయన ఆశయాలను ఆదర్శంగా తీసుకుని ప్రజలకు సమర్థవంతమైన సేవలు అందించాలని, దేశ అభివృద్ధి, జాతీయ సమైక్యతకు ప్రతి ఒక్కరూ తమ వంతు కృషి చేయాలని కలెక్టర్ సూచించారు. అనంతరం కలెక్టర్ ఆధ్వర్యంలో అధికారులు, ఉద్యోగులు, సిబ్బంది జాతీయ ఐక్యతా ప్రతిజ్ఞ చేశారు. దేశ ఐక్యత, సమగ్రత, భద్రతను కాపాడేందుకు అంకితభావంతో పనిచేస్తామని, ప్రజల మధ్య సోదరభావం, సామరస్యం, ఐక్యతను పెంపొందించేందుకు కృషిచేస్తామని ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో కలెక్టరేట్‌లోని వివిధ శాఖల అధికారులు, ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.

గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఓటరు నమోదు సమీక్ష

ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్ రెడ్డికి ఘన స్వాగతం



దశ, నర్సంపేట: పట్టణంలో నిర్వహించిన గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఓటరు నమోదు కార్యక్రమ సమీక్ష సమావేశానికి విచ్చేసిన శాసనమండలి డిప్యూటీ ఫ్లోర్ లీడర్, ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్ రెడ్డి కి పదవ వార్డు మాజీ కౌన్సిలర్ నాగిశెట్టి పద్మప్రసాద్ ఆధ్వర్యంలో బీఆర్ఎస్ పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా స్థానిక వార్డు నాయకులు, పార్టీ శ్రేణులు ఆయనకు శాలువా తో సత్కరించి ఆత్మీయ స్వాగతం పలికి తమ అభిమానాన్ని చాటుకున్నారు. అనంతరం ఓటరు నమోదు ప్రక్రియను విజయవంతం చేయడంపై చర్చించారు.



విద్యార్థుల భవిష్యత్తుకు విద్యే బలమైన పునాది

మున్సిపల్ చైర్‌పర్సన్ పెండెం శ్రీలక్ష్మీ రామానంద్

దశ, నర్సంపేట: విద్యార్థుల భవిష్యత్తుకు విద్యే అత్యంత బలమైన పునాది అని నర్సంపేట మున్సిపల్ చైర్‌పర్సన్ శ్రీమతి పెండెం శ్రీలక్ష్మీ రామానంద్ అన్నారు. శనివారం నర్సంపేట పట్టణంలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో విద్యార్థినులకు ఆమె ఉచితంగా స్కూల్ బ్యాగులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ మాట్లాడుతూ, విద్యార్థులు చిన్నతనం నుంచే చదువుపై ప్రత్యేక శ్రద్ధ వహించి, ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకొని భవిష్యత్తులో ఉన్నత స్థాయికి ఎదగాలని పిలుపునిచ్చారు. బాలికల విద్యకు ప్రాధాన్యతనిస్తూ, వారి విద్యాభివృద్ధికి అవసరమైన పూర్తి సహాయ సహకారాలు అందించడం ఎంతో సంతృప్తిని, ఆనందాన్ని ఇస్తోందని పేర్కొన్నారు. విద్యార్థులు క్రమశిక్షణతో కూడిన విద్యను అభ్యసించి పాఠశాలకు, తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో స్థానిక కౌన్సిలర్ వేముల సంధ్య సాంబయ్య గౌడ్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు (హెచ్.ఎం), ఉపాధ్యాయులు, పాఠశాల సిబ్బంది, విద్యార్థినులు తదితరులు పాల్గొన్నారు.

భారత చరిత్రలో చెరగని అధ్యాయం ఇందిరమ్మ



❖ పీసీసీ సభ్యులు పెండెం రామానంద్

దశ, నర్సంపేట: దేశ సమగ్రత, సార్వభౌమాధికారం కోసం ప్రాణాలను సైతం తృణప్రాయంగా అర్పించిన మహోన్నత నాయకురాలు, భారత మాజీ ప్రధాని స్వర్గీయ శ్రీమతి ఇందిరా గాంధీ అని తెలంగాణ రాష్ట్ర పీసీసీ సభ్యులు పెండెం రామానంద్ కొనియాడారు. శనివారం నర్సంపేట పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు పంబి వంశీకృష్ణ అధ్యక్షతన స్థానిక కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఇందిరా గాంధీ 42వ వర్ధంతి కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఇందిరా గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.

ఈ సందర్భంగా పెండెం రామానంద్ మాట్లాడుతూ, దేశాన్ని అఖండ భారతంగా నిలబెట్టేందుకు తన రక్తాన్ని ధారపోసిన అసలైన ఉక్కు మహిళ ఇందిరమ్మ అని పేర్కొన్నారు. 'గరీబీ హటావో' నినాదంతో పేదరిక నిర్మూలనకు విశేష కృషి చేయడమే కాకుండా, బ్యాంకుల జాతీయీకరణ, భూసంస్కరణలు వంటి సాహసోపేత నిర్ణయాలతో దేశ సామాజిక, ఆర్థిక పునాదులను పటిష్టం చేశారని గుర్తుచేశారు. దేశ రక్షణ, సమైక్యత కోసం ఆమె చేసిన త్యాగం నేటి తరానికి ఎల్లప్పుడూ స్ఫూర్తిదాయకమని అన్నారు.

ఈ కార్యక్రమంలో స్థానిక కౌన్సిలర్లు ముత్తినేని వెంకన్న, మాదాసి రవి, ములుకల వినోద సాంబయ్య, కాంపెల్లి వీణ విజేందర్ రెడ్డి, వరంగల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి ఎర్ర యాకూబ్ రెడ్డి, నర్సంపేట నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు తుమ్మలపెల్లి సందీప్, మాజీ ప్రజాప్రతినిధులు కాట ప్రభాకర్, పేరం బాబురావు, రామగోని సుధాకర్ గౌడ్ పాల్గొన్నారు. అలాగే పట్టణ కాంగ్రెస్ కార్యదర్శి పిన్నింటి కిరణ్ కుమార్ రెడ్డి, వార్డు అధ్యక్షులు మేరుగు కిరణ్ యాదవ్ (9వ వార్డు), మహాదేవుని రాజ్ వీర్ (25వ వార్డు), 25వ వార్డు యూత్ అధ్యక్షుడు కాట అఖిల్, కాంగ్రెస్ నాయకులు వేముల నవీన్ గౌడ్, గుడికందుల సదానందం, కీసరి రాజీవ్, ముదరబోయిన రాజు, పొలబోయిన ప్రణయ్, నల్లోండ వంశీ, కొలువుల స్వామి, దేశి సాయి పటేల్, కొలువుల పవన్, చీకటి శివమణి, అందే రంజిత్ తదితరులు పెద్దసంఖ్యలో పాల్గొని నివాళులర్పించారు.

రెజోనెన్స్ స్కూల్‌లో ఘనంగా విద్యార్థుల సమ్మిట్ ప్రదర్శన



దశ, ఉప్పల్: ఉప్పల్ భాగాయత్‌లోని రెజోనెన్స్ స్కూల్‌లో ప్రిన్సిపల్ మాధురి ఆధ్వర్యంలో విద్యార్థుల సమ్మిట్ ప్రదర్శన ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు సైన్స్, గణితం, తెలుగు, బయాలజీ, సంగీతం తదితర విభాగాల్లో తమ ప్రతిభను చాటుకున్నారు. విద్యార్థులు తమకు ఆసక్తి ఉన్న రంగాలను ఎంచుకుని, స్వయంగా ప్రాజెక్టు వర్క్‌లను రూపొందించి పాఠశాల ఆవరణలో ప్రదర్శించారు. విద్యార్థులు రూపొందించిన వివిధ ప్రాజెక్టులు, వినూత్న ఆలోచనలు తల్లిదండ్రులను, ఉపాధ్యాయులను ఎంతగానో ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమానికి విద్యార్థుల తల్లిదండ్రులతో పాటు ఉపాధ్యాయులు పెద్ద సంఖ్యలో హాజరై ప్రదర్శనలను ఆసక్తిగా తిలకించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ మాధురి మాట్లాడుతూ.. విద్యార్థులు తమకు ఇష్టమైన రంగాల్లో ఉన్న ప్రతిభను అద్భుతంగా ప్రదర్శించారని, ఇలాంటి కార్యక్రమాలు విద్యార్థుల్లో సృజనాత్మకత, ఆత్మవిశ్వాసం, నైపుణ్యాలను పెంపొందిస్తాయని తెలిపారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులను అభినందించి, వారి ప్రతిభ ఆధారంగా బహుమతులు అందజేశారు.

బాలల భద్రతపై న్యాయ అవగాహన!



దశ, ఖమ్మం: బాలల హక్కుల పరిరక్షణ, లైంగిక వేధింపుల నివారణే లక్ష్యంగా ఖమ్మం జిల్లాలోని పలు పాఠశాలల్లో న్యాయ అవగాహన శిబిరాలు నిర్వహించారు. జాతీయ న్యాయ సేవాధికార సంస్థ (నాల్సా), తెలంగాణ రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ (టీఎస్ఎల్ఎస్ఏ) ఆధ్వర్యంలో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ (డీఎల్ఎస్ఏ) చేపట్టిన 'సురక్షిత్ బచ్పన్ అభియాన్'లో భాగంగా అక్టోబర్ 26 నుంచి 31 వరకు ఈ ప్రత్యేక కార్యక్రమాలు కొనసాగాయి.

ఈ సందర్భంగా ఖమ్మం న్యాయ విభాగానికి చెందిన న్యాయాధికారులు జిల్లాలోని వివిధ పాఠశాలలను సందర్శించి విద్యార్థులకు బాలలపై లైంగిక నేరాల నుంచి రక్షణ చట్టం-2012 (పోక్సో)పై అవగాహన కల్పించారు. ప్రధాన సివిల్ జడ్జి కె. జ్యోతిర్మయి, మొదటి అదనపు జూనియర్ సివిల్ జడ్జి బి.రజిని, మూడవ అదనపు జూనియర్ సివిల్ జడ్జి ఎ.ప్రవీణ్, నాలుగవ అదనపు జూనియర్ సివిల్ జడ్జి బి. నాగలక్ష్మి వివిధ పాఠశాలల్లో ఈ కార్యక్రమాలు నిర్వహించారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి పి.దేవి మనస బాలికల ఉన్నత పాఠశాలలో విద్యార్థినులకు పోక్సో చట్టంపై ప్రత్యేకంగా అవగాహన కల్పించారు.

కేసుల్లో కన్విక్షన్ శాతం పెంచేలా సమర్థవంతంగా పనిచేయాలి

కోర్టు డ్యూటీ అధికారులకు ఎస్పీ శరత్ చంద్ర పవార్ సూచన



దశ, నల్లగొండ: కోర్టుల్లో కేసుల విచారణ సందర్భంగా నిందితులకు శిక్షలు పడే కన్విక్షన్ శాతాన్ని మరింత పెంచేందుకు కోర్టు డ్యూటీ అధికారులు సమన్వయంతో, బాధ్యతాయుతంగా పనిచేయాలని నల్లగొండ జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్ సూచించారు. శనివారం జిల్లా పోలీస్ కార్యాలయంలో కోర్టు డ్యూటీ అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రతి కేసులో నేరం నిరూపితమయ్యేలా దర్యాప్తు అధికారులు, కోర్టు డ్యూటీ సిబ్బంది సమన్వయంతో వ్యవహరించాలన్నారు. దర్యాప్తు సమయంలో సేకరించిన ఆధారాలు, సాక్షుల వాంగ్మూలాలు, వైద్య నివేదికలు, ఇతర కీలక పత్రాలను కోర్టులో సక్రమంగా సమర్పించేలా నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. విచారణలో ఎదురయ్యే సమస్యలను ఎప్పటికప్పుడు గుర్తించి సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించాలన్నారు. ముఖ్యంగా ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ, పోక్సో కేసుల్లో బాధితులకు సత్వర న్యాయం అందేలా ప్రత్యేక శ్రద్ధ వహించాలని చెప్పారు. సాక్షుల హాజరు, సాక్ష్యాధారాల సమర్పణ, కోర్టు ప్రక్రియలను పర్యవేక్షిస్తూ పబ్లిక్ ప్రాసిక్యూటర్లతో సమన్వయం చేసుకోవాలన్నారు. కన్విక్షన్ శాతం పెంపులో ఉత్తమ ప్రతిభ కనబరిచిన అధికారులను ఎస్పీ అభినందించారు. భవిష్యత్తులోనూ ఇదే స్ఫూర్తితో పనిచేసి పోలీస్ శాఖకు మంచి పేరు తీసుకురావాలని సూచించారు. సమావేశంలో అడిషనల్ ఎస్పీ రమేశ్, సీఐలు శ్రీనునాయక్, బీషన్న, సంబంధిత పోలీస్ అధికారులు, కోర్టు డ్యూటీ అధికారులు పాల్గొన్నారు.

ఘనంగా సర్దార్ పటేల్ జయంతి వేడుకలు

భారత తొలి ఉప ప్రధానమంత్రి, ఉక్కు మనిషి సర్దార్ వల్లభభాయ్ పటేల్ జయంతిని పురస్కరించుకుని శనివారం నల్లగొండ జిల్లా పోలీస్ కార్యాలయంలో జాతీయ ఐక్యత దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ శరత్ చంద్ర పవార్ పటేల్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం పోలీస్ అధికారులు, సిబ్బందితో కలిసి జాతీయ ఐక్యత ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ఏఓ శివప్రసాద్, ఎస్బీ డీఎస్పీ మల్లారెడ్డి, ఏఆర్ డీఎస్పీ శ్రీనివాసులు, సీఐలు, ఆర్ఐలు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.



బుచ్చంపేటలో సిమెంటు రోడ్ల నిర్మాణానికి శ్రీకారం

దశ, మంగపేట: ములుగు జిల్లా మంగపేట మండలం బుచ్చంపేట గ్రామంలో 35 లక్షలతో 7 సిమెంటు రోడ్ల నిర్మాణ పనులను శనివారం ప్రారంభించారు. మండల పార్టీ అధ్యక్షుడు చెట్టిపెల్లి వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి పంచాయతీరాజ్ సంచాలకుడు గుమ్మడి సోమయ్య ముఖ్య అతిథిగా హాజరై పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా గుమ్మడి సోమయ్య మాట్లాడుతూ మంత్రి ధనసరి అనసూయ సీతక్క చొరవతో మంగపేట మండలం అభివృద్ధి దిశగా ముందుకు సాగుతోందని అన్నారు. గ్రామాల్లో రోడ్లు, మురుగు కాల్వల నిర్మాణానికి ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని చెప్పారు.

బియ్యం ధరలకు కళ్లెం.. గరిష్ట విక్రయ ధరలు ఖరారు

నిర్ణీత ధరలకు మించి విక్రయిస్తే కఠిన చర్యలు



దశ, రంగారెడ్డి: రాష్ట్రంలో బియ్యం ధరల నియంత్రణకు అధికారులు కీలక నిర్ణయం తీసుకున్నారు. వివిధ రకాల బియ్యానికి గరిష్ట విక్రయ ధరలను నిర్ణయించినట్లు రంగారెడ్డి జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కె. చంద్రా రెడ్డి వెల్లడించారు. కమిషనర్‌తో జిల్లా, రాష్ట్ర రైస్ మిల్లర్ల అసోసియేషన్ ప్రతినిధులు నిర్వహించిన సమావేశంలో ఈ ధరలను ఖరారు చేసినట్లు తెలిపారు. నిర్ణయం ప్రకారం తెలంగాణ బీపీటీ బియ్యం కిలో రూ.66, సోనా బియ్యం రూ.74, శ్రీరామగోల్డ్ బియ్యం రూ.79గా నిర్ణయించారు. రైస్ మిల్లర్లు, ట్రేడర్లు, హోల్‌సేల్ డిపోలు, రిటైలర్లు ఈ ధరలకు మించకుండా విక్రయాలు జరపాలని ఆదేశించారు. వినియోగదారుల నుంచి అధిక ధరలు వసూలు చేస్తే సంబంధిత వ్యాపారులపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రజలకు న్యాయమైన ధరలకు బియ్యం అందించేలా వ్యాపారులంతా నిర్ణయాలను తప్పనిసరిగా పాటించాలని అదనపు కలెక్టర్ సూచించారు.

సీజ్ చేసిన నగదు, బంగారం దుర్వినియోగం.. కానిస్టేబుల్ అరెస్ట్

❖ మీర్‌పేట పోలీస్ స్టేషన్‌లో ఘటన.. రూ.1.70 లక్షల నగదు బదిలీ, రూ.12.37 లక్షలకు బంగారం తాకట్టు



దశ, హైదరాబాద్: ప్రజల ఆస్తులకు, సాక్ష్యాధారాలకు రక్షణగా ఉండాల్సిన పోలీసు ఉద్యోగే స్టేషన్‌లో స్వాధీనం చేసుకున్న నగదు, బంగారు ఆభరణాలను దుర్వినియోగం చేసిన ఘటన మీర్‌పేట పోలీస్ స్టేషన్ పరిధిలో వెలుగుచూసింది. ఈ వ్యవహారంలో కానిస్టేబుల్ శ్రవణ్‌కుమార్‌పై పోలీసులు కేసు నమోదు చేసి అరెస్టు చేశారు. అనంతరం కోర్టులో హాజరుపరిచి రిమాండ్‌కు తరలించారు. ఒక కేసులో పోలీసులు స్వాధీనం చేసుకున్న మొబైల్ ఫోన్‌ను ఉపయోగించి రూ.1.70 లక్షలను అక్రమంగా బదిలీ చేసినట్లు విచారణలో గుర్తించారు. అలాగే పోలీసుల వద్ద సీజ్ చేసిన బంగారు ఆభరణాలను తాకట్టు పెట్టి రూ.12.37 లక్షలు పొందినట్లు వెల్లడైంది. స్టేషన్ పరిధిలోని కేసుకు సంబంధించిన సొత్తును ఇలా దుర్వినియోగం చేయడం పోలీసు శాఖలో చర్చనీయాంశంగా మారింది. కానిస్టేబుల్ తండ్రి ఊపిరితిత్తుల క్యాన్సర్‌తో బాధపడుతుండటంతో వైద్య చికిత్స కోసం ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొన్నట్లు సమాచారం. ఈ నేపథ్యంలోనే స్వాధీనంలో ఉన్న నగదు, బంగారాన్ని దుర్వినియోగం చేసినట్లు తెలుస్తోంది. ఇటీవలే ఆయన తండ్రి మరణించినట్లు సమాచారం. ఈ ఘటనపై మీర్‌పేట పోలీసులు కేసు నమోదు చేసి కానిస్టేబుల్‌ను అరెస్టు చేయడంతో పాటు రిమాండ్‌కు తరలించారు. పోలీసుల ఆధీనంలో ఉండాల్సిన కేసులకు సంబంధించిన సొత్తుకే భద్రత లేకపోతే ఎలా? స్వాధీనం చేసుకున్న సొత్తు నిర్వహణ, భద్రతా పర్యవేక్షణలో ఎలాంటి లోపాలు చోటుచేసుకున్నాయి? అనే ప్రశ్నలు ఈ ఘటనతో తలెత్తుతున్నాయి.

బీ.ఆర్.ఎస్. నాయకురాలు స్మిత గౌడ్ ఆధ్వర్యంలో...

పట్టభద్రుల ఓటర్ల నమోదు ప్రక్రియను ముమ్మరం చేయాలి



❖ సికింద్రాబాద్ ఎమ్మెల్యే పద్మారావు గౌడ్..

దశ ఓయూ: పట్టభద్రుల ఎం. ఎల్. సి. ఓటర్ల నమోదు ప్రక్రియను సికింద్రాబాద్ నియోజకవర్గ పరిధిలో ముమ్మరం చేశామని, రానున్న వారం రోజుల వ్యవధిలో తమ పార్టీ శ్రేణులు అన్ని వార్డుల్లో పర్యటించి నమోదు ప్రక్రియలో పాల్గొనేలా ఏర్పాట్లు జరిపామని సికింద్రాబాద్ శాసనసభ్యులు, మాజీ డిప్యూటీ స్పీకర్ తీగుల్ల పద్మారావు గౌడ్ పిలుపునిచ్చారు. తార్నాక మున్సిపల్ వార్డ్ పరిధిలోని వివిధ ప్రాంతాల్లో పద్మారావు గౌడ్ శనివారం విస్తృతంగా పర్యటించి పట్టభద్రుల ఓటర్ల నమోదు ప్రక్రియలో పాల్గొన్నారు. బీ.ఆర్.ఎస్. నాయకురాలు స్మిత గౌడ్ ఆధ్వర్యంలో వైశాలి అపార్ట్మెంట్స్ లో జరిగిన ఓటర్ల నమోదును ప్రారంభించారు. ఈ సందర్భంగా పద్మారావు గౌడ్ మాట్లాడుతూ.. సికింద్రాబాద్ లోని 8 మున్సిపల్ వార్డుల్లో పట్ట భద్రుల ఓటర్ల నమోదును ముమ్మరం చేశామని తెలిపారు. ఇప్పటికీ ఐదు వేల మంది పేర్లను నమోదు చేయించామని, రానున్న వారం రోజుల వ్యవధిలో అర్హులైన అందరు పట్టభద్రుల పేర్లను నమోదు చేయించాలని నాయకులకు సూచించారు.ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ యువ నేత రామేశ్వర్ గౌడ్, మాజీ కార్పొరేటర్ అలకుంట సరస్వతి తో పాటు నాయకులు పాల్గొన్నారు.



టిఫిన్ సెంటర్ నిర్వాహకుడిపై దాడి.. వస్తువులు ధ్వంసం

దాడికి పాల్పడిన వ్యక్తిపై నాచారం పోలీసుల కేసు నమోదు

దశ, ఓయూ: మల్లాపూర్‌లోని ఓ టిఫిన్ సెంటర్‌లో పనిచేస్తున్న వ్యక్తిపై దాడి చేసి, అసభ్య పదజాలంతో దూషించడంతో పాటు దుకాణంలోని వస్తువులను ధ్వంసం చేసిన ఘటనపై నాచారం పోలీసులు కేసు నమోదు చేశారు. ఉషోదయ సూపర్ మార్కెట్ ఎదురుగా ఉన్న శ్రీ బాలాజీ 99 దోసాస్ వెరైటీస్ టిఫిన్ సెంటర్‌లో అక్టోబర్ 30న రాత్రి 11 గంటల సమయంలో శ్రవణ్ అనే వ్యక్తి గొడవకు దిగాడు. ఆహార పదార్థాలను చేతితో తోసివేసి, నిర్వాహకుడిని అసభ్య పదజాలంతో దూషించాడు. అనంతరం టిఫిన్ సెంటర్‌లోని వస్తువులు, వంట పాత్రలను నేలపైకి విసిరి ధ్వంసం చేయడంతో పాటు ఫిర్యాదుదారుడిపై చేతులతో దాడి చేసి, అక్కడ వ్యాపారం కొనసాగించనివ్వనని బెదిరించినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. బాధితుడు అక్టోబర్ 31న నాచారం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా, పోలీసులు కేసు నమోదు చేసి చట్టపరమైన చర్యలు చేపట్టారు.

పెద్ది సుదర్శన్ రెడ్డికి కొవ్వొత్తులతో నివాళి

ఉద్యమ ప్రస్థానాన్ని గుర్తు చేసుకున్న ఉద్యమకారులు



దశ, నర్సంపేట: తెలంగాణ ఉద్యమ నేత, దివంగత మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి మరణించి మూడు నెలలు పూర్తయిన సందర్భంగా నర్సంపేట పట్టణంలోని అమరవీరుల స్థూపం వద్ద తెలంగాణ ఉద్యమకారులు ఘనంగా నివాళులర్పించారు. తెలంగాణ ఉద్యమకారుల నర్సంపేట కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో పెద్ది సుదర్శన్ రెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి, కొవ్వొత్తులు వెలిగించి శ్రద్ధాంజలి ఘటించారు. ఈ సందర్భంగా మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్లు బత్తిని శ్రీనివాస్, గుంటిక సోమన్న, మాజీ కౌన్సిలర్ దార్ల రమాదేవి, మచ్చిక నర్సయ్య, వాసం కరుణ, జయ, సుదర్శన్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం బత్తిని శ్రీనివాస్, దార్ల రమాదేవి మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమం ప్రారంభమైన నాటి నుంచి ప్రతి ఉద్యమ కార్యక్రమంలోనూ పెద్ది సుదర్శన్ రెడ్డితో కలిసి పనిచేశామని గుర్తుచేసుకున్నారు. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ఆయన చేసిన పోరాటాలు, అందించిన సేవలు చిరస్మరణీయమన్నారు. ఆయన మరణం నర్సంపేటనియోజకవర్గంతో పాటు రాష్ట్రవ్యాప్తంగా తీరని లోటని ఆవేదన వ్యక్తం చేశారు. పెద్ది సుదర్శన్ రెడ్డి ఆశయ సాధన కోసం కృషి చేస్తామని, కేసీఆర్‌ను తిరిగి ముఖ్యమంత్రిని చేయడమే లక్ష్యంగా బీఆర్ఎస్ పార్టీని ముందుకు తీసుకెళ్తామని వారు పేర్కొన్నారు.




కార్మిక హక్కుల పరిరక్షణకు ఏఐటీయూసీ పోరాటం!

❖ మణుగూరులో ఘనంగా 107వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు
❖ పట్టణ వ్యాప్తంగా ఎగిరిన కార్మిక జెండాలు
❖ పెద్ద ఎత్తున తరలివచ్చిన కార్మిక లోకం

దశ, మణుగూరు: శ్రామిక వర్గం హక్కులు, సంక్షేమం కోసం నిరంతరం పోరాడిన ఘన చరిత్ర ఏఐటీయూసీకి ఉందని ఆ సంఘ జిల్లా ఉపాధ్యక్షుడు ఆర్. లక్ష్మీనారాయణ అన్నారు. శనివారం మణుగూరు పట్టణ, మండల కేంద్రాల్లో ఏఐటీయూసీ 107వఆవిర్భావదినోత్సవవేడుకలనుఘనంగా నిర్వహించారు. ఆర్టీసీ డిపో, బొగ్గుముట కార్మిక కేంద్రం, గుమాస్తా, ఆటో, మ్యాజిక్ యూనియన్లతో పాటు ప్రధాన కార్యాలయాల వద్ద కార్మిక జెండాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా లక్ష్మీనారాయణ మాట్లాడుతూ 1920 అక్టోబర్ 31న ముంబయిలో లాలా లజపతిరాయ్ అధ్యక్షతన ఏఐటీయూసీఏర్పాటైందని,నాటినుంచినేటివరకుకార్మికుల హక్కుల కోసం పోరాడుతోందన్నారు. ఎనిమిది గంటల పనిదినం,పీఎఫ్,ఈఎస్ఐ,గ్రాట్యుటీ,వైద్య సెలవులు,ప్రమాద బీమా వంటి హక్కులు సంఘం పోరాటాల ఫలితమని పేర్కొన్నారు.సింగరేణి, ఆర్టీసీ, రైల్వే, బీటీపీఎస్, హెవీ వాటర్ ప్లాంట్‌తో పాటు అసంఘటిత రంగ కార్మికుల సంక్షేమం కోసంనిరంతరంకృషిచేస్తోందన్నారు.సీపీఐపట్టణకార్యదర్శి దుర్గాల సుధాకర్, ఏఐటీయూసీ మండల కార్యదర్శి గడ్డం వెంకటేశ్వర్లు మాట్లాడుతూ కేంద్రంలోని ఎన్డీయే ప్రభుత్వం కార్మిక వ్యతిరేక విధానాలను అనుసరిస్తోందని విమర్శించారు. 44కార్మిక చట్టాలనురద్దుచేసినాలుగులేబర్ కోడ్‌లుగా మార్చడం కార్పొరేట్ సంస్థలకు మేలు చేసే చర్యగా అభివర్ణించారు. కార్మిక హక్కులకు భంగం కలిగించే లేబర్ కోడ్‌లను ఉపసంహరించుకునే వరకు కార్మిక సంఘాలన్నీ ఐక్యంగా ఉద్యమించాలని పిలుపునిచ్చారు. అనంతరం నాయకుడు తారాప్రసాద్ కార్మికులకు,ప్రజలకు మిఠాయిలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ, ఏఐటీయూసీ నాయకులు జక్కుల రాజబాబు, సోందే కుటుంబరావు, తోట రమేష్, వేరుపుల నరేష్, ఎస్కే సర్వర్, వజ్జ వెంకటేశ్వర్లు, కొత్తపల్లి సీతారాములు, బొసెట్టి సంపత్, మంగి వీరయ్య, అదెర్ల రాములు, కోడిమెల సుజాత, బోలగాని సమ్మక్కతో పాటు వివిధ యూనియన్ల నాయకులు పాల్గొన్నారు.

స్కాలర్‌షిప్ పరీక్ష కేంద్రాల వద్ద 163 బీఎన్ఎస్ఎస్ సెక్షన్ అమలు

❖ 500 మీటర్ల పరిధిలో ఐదుగురికి మించి గుమిగూడరాదు..
❖ జిరాక్స్ కేంద్రాలు మూసివేయాలని ఆదేశాలు



దశ, సిద్దిపేట: జిల్లాలో నవంబర్ 1న నిర్వహించనున్న నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్ పరీక్ష2026 నేపథ్యంలో పరీక్షా కేంద్రాల వద్ద శాంతిభద్రతల పరిరక్షణకు పోలీస్ కమిషనర్ రష్మీ పెరుమాళ్ భారతీయ నాగరిక్ సురక్షా సంహిత (బీఎన్ఎస్ఎస్) సెక్షన్ 163 కింద ఆంక్షలు విధించారు. పరీక్షలు ప్రశాంతంగా నిర్వహించేందుకు జిల్లాలోని తొమ్మిది పరీక్షా కేంద్రాల చుట్టూ 500 మీటర్ల పరిధిలో ఐదుగురు లేదా అంతకంటే ఎక్కువ మంది గుమిగూడడాన్ని నిషేధించారు. సిద్దిపేట ప్రభుత్వ బాయ్స్ హైస్కూల్, ప్రభుత్వ గర్ల్స్ హైస్కూల్, ప్రభుత్వ న్యూ హైస్కూల్, జడ్పీహెచ్ఎస్ ఇందిరానగర్ ఏ, బీ కేంద్రాలు, గజ్వేల్ ముత్రాజ్‌పల్లిలోని తెలంగాణ మోడల్ స్కూల్, సంగాపూర్ రోడ్డులోని ప్రభుత్వ బాయ్స్ హైస్కూల్, హుస్నాబాద్‌లోని తెలంగాణ మోడల్ స్కూల్, జడ్పీహెచ్ఎస్ బాయ్స్ స్కూల్ పరీక్షా కేంద్రాలుగా ఏర్పాటు చేశారు.

ఈ ఆంక్షలు నవంబర్ 1వ తేదీ ఉదయం 6 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు అమల్లో ఉంటాయి. పరీక్షా కేంద్రాల పరిసరాల్లో కర్రలు, రాళ్లు, ఆయుధాలు, ఇతర ప్రమాదకర వస్తువులు తీసుకెళ్లడం నిషేధం. పరీక్షలకు సంబంధించిన నిషేధిత పత్రాలను తీసుకెళ్లరాదని, పరీక్షలు జరిగే సమయంలో కేంద్రాల సమీపంలోని జిరాక్స్ షాపులను తప్పనిసరిగా మూసివేయాలని కమిషనర్ ఆదేశించారు. విధుల్లో ఉన్న పోలీస్ అధికారులు, సైనిక సిబ్బంది, విద్యాశాఖ ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారులు, అంత్యక్రియల ఊరేగింపులకు ఈ ఆంక్షల నుంచి మినహాయింపు ఉంటుంది. విద్యార్థులు ఎలాంటి ఆందోళన లేకుండా పరీక్షలు రాసేలా పోలీస్ స్టేషన్ల అధికారులు తగిన బందోబస్తు, భద్రతా ఏర్పాట్లు చేయాలని సీపీ సూచించారు. ఉత్తర్వులను ఉల్లంఘించిన వారిపై చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

దేశ సమగ్రత కోసం విద్యార్థి యువత కృషి చేయాలి

పోలీస్ స్టేషన్లో ఘనంగా ఏక్ దా దివిస్ కార్యక్రమ వీక్షణ



దశ, మునగాల: నేటితరం విద్యార్థి యువత తమలో దేశం పట్ల భక్తిని పెంచుకుంటూ, దేశ సమైక్యత కోసం, సమగ్రత కోసం కృషి చేయాలని స్థానిక సీఐ ప్రతాప్ లింగం అన్నారు. శనివారం సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతి సందర్భంగా ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ఆధ్వర్యంలో గుజరాత్ లో ఏక్తా నగరంలో నిర్వహిస్తున్న ఏక్ దా దివీస్ ప్రత్యేక పరేడ్ కార్యక్రమ ర్యాలీ విశేషాలను లైవ్ షో ద్వారా మండల కేంద్రంలోని స్థానిక పోలీస్ స్టేషన్ నందు , పలువురు విద్యార్థిని విద్యార్థులకు , యువకులకు ప్రత్యేకంగా టీవీలో చూపిస్తూ, వారిలో దేశభక్తిని, దేశాఐక్యతను పెంచేందుకు స్థానిక పోలీస్ శాఖ ప్రత్యేక ఏర్పాట్లు చేసింది ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన స్థానిక సీఐ ప్రతాప్ లింగం ఏక్తా దివీస్ లైవ్ షో కార్యక్రమాన్ని ప్రారంభించిన అనంతరం విద్యార్థి యువకుల్ని ఉద్దేశించి మాట్లాడుతూ, దేశ ఐక్యత కోసం దేశ సమగ్రత కోసం ఎంతగానో పోరాడిన సర్దార్ వల్లభాయ్ పటేల్ స్ఫూర్తితో నేటితరం విద్యార్థి యువతరం మనదేశ రక్షణ కోసం కృషి చేయాలని ఆయన తెలిపారు.

నేడుదేశాన్నిపట్టిపీడిస్తున్నతీవ్రవాదం ఉగ్రవాదాన్నిఎదుర్కొనేందుకు దేశ పౌరులుగా విద్యార్థి దశ నుండే ప్రతి ఒక్కరు దేశభక్తితో మెలగాలన్నారు. దేశ ప్రజల ఐక్యతను చాటి చెప్పేందుకు , సర్వమతాల సమహారమైన భారతదేశ సార్వభౌమత్వాన్ని కొనసాగించేందుకు గుర్తుగా నేడు దేశ ప్రధాని నరేంద్ర మోడీ వల్లభాయ్ పటేల్ జయంతి సాక్షిగా ఏక్ దా దివిస్ కార్యక్రమం నిర్వహిస్తున్నారని ఆయన తెలిపారు. ఈకార్యక్రమంలో స్థానిక ఎస్సై మల్లు సంజీవరెడ్డి, స్థానిక పోలీస్ సిబ్బంది పలువురు విద్యార్థులు యువకులు పాల్గొన్నారు.



బూరుగడ్డ ఆలయంలో సీనియర్ సివిల్ జడ్జి పూజలు

దశ, హుజూర్‌నగర్: హుజూర్‌నగర్ మండలం బూరుగడ్డ గ్రామంలోని ప్రసిద్ధ శ్రీ ఆది వరాహ లక్ష్మీనరసింహ వేణుగోపాల స్వామి దేవస్థానాన్ని హుజూర్ నగర్ సీనియర్ సివిల్ జడ్జి నక్కా శ్యాంసుందర్ శనివారం సందర్శించి, స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయానికి విచ్చేసిన గౌరవ న్యాయమూర్తికి ఆలయ కార్యనిర్వహణాధికారి, పాలకమండలి చైర్మన్, ధర్మకర్తలు,స్థానిక సర్పంచ్ మరియు ప్రధాన అర్చకులు ఘనంగా స్వాగతం పలికారు.అనంతరం ఆలయ విశిష్టతను,చరిత్రను వివరించి, ప్రత్యేక అర్చనలు జరిపించారు. పూజా కార్యక్రమాల అనంతరం అర్చకులు వేద ఆశీర్వచనం పలికి, తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వహణాధికారి నాగేళ్ళ శంభి రెడ్డి,ఆలయ చైర్మన్ యరగాని బిక్షం గౌడ్,గ్రామ సర్పంచ్ యరగాని రాధా నాగరాజు, ఆలయ ధర్మకర్తలు యరగాని సతీష్ గౌడ్,ప్రార్థన బోయిన గంగయ్య, గూడెపు నాగలింగం, అద్దంకి సంధ్యా నాగేశ్వరరావు, పిట్టల గురవయ్య, కాస్తల శంకర్, ఆలయ అర్చకులు ముదుంబై హరీష్ కుమారాచార్యులు,ఎస్ఐ చలికంటి నరేష్,న్యాయవాదులు కాల్వ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

లక్ష్మీనరసింహస్వామిని దర్శించుకున్న గవర్నర్

❖ వేద విద్వాన్ మహాసభలో పాల్గొన్న
❖ గవర్నర్, మంత్రి శ్రీధర్‌బాబు, ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య



దశ, జనగామ: యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీనరసింహస్వామి క్షేత్రాన్ని రాష్ట్ర గవర్నర్ శివ్ ప్రతాప్ శుక్లా సందర్శించి స్వామివారిని దర్శించుకున్నారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో నిర్వహించిన తెలంగాణ వేద విద్వాన్ మహాసభ 26వ వార్షికోత్సవ వేడుకల్లో ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, ఆలేరు ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య, టీపీసీసీ సభ్యుడు, వైటీడీఏ సభ్యుడు డాక్టర్ లక్ష్మీనారాయణ నాయక్ హాజరయ్యారు. ఈ సందర్భంగా వేద పండితులు, వేద విద్యార్థులతో కలిసి వార్షికోత్సవ కార్యక్రమాల్లో పాల్గొన్నారు. వేద విద్య ప్రాముఖ్యత, వేద సంప్రదాయాల పరిరక్షణ, వేద విద్యాభివృద్ధిపై చర్చించారు. వేద పాఠశాల విద్యార్థులకు ప్రశంసాపత్రాలు అందజేసి అభినందించారు.

వేద పాఠశాల అభివృద్ధికి ప్రత్యేక చర్యలు

గవర్నర్ పర్యటన అనంతరం నిర్వహించిన విలేకరుల సమావేశంలో మంత్రి శ్రీధర్‌బాబు మాట్లాడుతూ.. యాదగిరిగుట్టలోని వేద పాఠశాలను మరింత అభివృద్ధి చేసి, విద్యార్థులకు మెరుగైన విద్యా సౌకర్యాలు కల్పించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. వేద విద్యాభివృద్ధికి ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తుందని పేర్కొన్నారు.

భక్తులకు మరిన్ని సౌకర్యాలు కల్పిస్తాం

ఈ సందర్భంగా వైటీడీఏ సభ్యుడు డాక్టర్ లక్ష్మీనారాయణ నాయక్ మాట్లాడుతూ.. ఆలయ పాలకమండలి ఆధ్వర్యంలో కల్యాణ మండపం, టెంపుల్ ఆర్చ్ నిర్మాణ పనులకు భూమిపూజ నిర్వహించినట్లు తెలిపారు. యాదగిరిగుట్టకు వచ్చే భక్తులకు మరిన్ని మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు చర్యలు చేపడుతున్నట్లు వెల్లడించారు. ఆలయ అభివృద్ధితోపాటు భక్తులకు సౌకర్యవంతమైన దర్శనం కల్పించడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నట్లు తెలిపారు.